ధ్రువీకరణ పత్రాల పరిశీలన

కడప క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయిన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పరిశీలనకు మొత్తం 352 మంది అభ్యర్థులకు గాను 190 మంది సివిల్, ఏపీఎస్పీ అభ్యరులు హాజరయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామన్నారు. అభ్యర్థులు సమర్పించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పత్రాల పరిశీలన అనంతరం అర్హత ఉన్న అభ్యర్థులను తదుపరి నియామక దశకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు వీరేశ్, టైటస్, శివరాముడు, ఏవో వెంకటరమణ, సూపరింటెండెంట్ గౌస్‌పీర్ తదితరులు పాల్గొన్నారు.

బార్..బేర్..!

- బార్లకోసం ముందుకు రాని వ్యాపారులు
- మార్జిన్ జీరో.. బ్రాండిషాపులకు పర్మిట్ రూముల ఎఫెక్ట్
- 27 బార్లకు.. రెండే దరఖాస్తులు
- నేడే చివరి రోజు



(కడప-ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్‌శాఖ తీసుకువచ్చిన నూతన బార్ల పాలసీ పట్ల వ్యాపారులు విముఖత చూపుతున్నారు. సెప్టెంబరు 1 నుంచి నూతన బార్ విధానం అమల్లోకి రానుంది. దీంతో బార్ల కోసం ఎక్సైజ్‌శాఖ దరఖాస్తులు ఆహ్వానించింది. మంగళవారం సాయంత్రం 5గంటలకు చివరి రోజుగా నిర్ణయించింది. ఒకప్పుడు మద్యం షాపులన్నా, బార్లన్నా వ్యాపారులు పోటీ పడి టెండర్లు వేసేవారు. ఈసారి నూతన పాలసీపట్ల వ్యాపారులు ఆసక్తి కనబరచకపోవడంతో బార్లకు ఇంకా దరఖాస్తులే రావడం లేదు. జిల్లాలో 27 బార్లు ఉంటే, కేవలం ఇద్దరు మాత్రమే డబ్బులు చెల్లించారు.

ఆసక్తి చూపని వ్యాపారులు

జిల్లాలో 27 బార్లున్నాయి. కడపలో 12 బార్లు, ప్రొద్దుటూరులో 7, బద్వేలు, పులివెందులలో రెండు చొప్పున, ఎర్రగుంట్ల, కమలాపురం, మైదుకూరు, జమ్మలమడుగులో ఒక్కో బార్ ఉన్నాయి. బార్లకు మద్యం లైసెన్సు ఫీజును రూ.55లక్షలుగా నిర్ణయించారు. దరఖాస్తు ఫీజు రూ.5లక్షలు. ఇది నాన్ రీఫండ్ అమౌంటు. ఒక్కో బార్‌కు 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తామని ఎక్సైజ్‌శాఖ నిబంధన పెట్టింది. మార్జిన్ మనీ లేదు. దీంతో వ్యాపారులు ఆసక్తి చూపడంలేదు. ప్రస్తుతం ప్రైవేటు మద్యం షాపులున్నాయి. వాటికి పర్మిట్ రూములకు కూడా అనుమతినిచ్చారు. అంటే షాపుల వద్దనే తాగేందుకు అన్నిఏర్పాట్లు చేస్తారు. అక్కడ ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు సాగుతాయి. బార్లలో ఎంత ధరకయినా అమ్ముకోవచ్చు. అర్ధరాత్రి 12 వరకు దుకాణాలు తెరచుకోవచ్చు. ఎమ్మార్పీకే బ్రాందీషాపుల వద్ద కూర్చుని తాగే అవకాశం ఉండడంతో బార్లకు మందుబాబులు రారనే మీమాంసలో వ్యాపారులున్నారు. కాగా.. జిల్లాలోని మొత్తం 27 బార్లకు గాను సోమవారం సాయంత్రానికి 114 మంది ఎన్‌రోల్‌మెంటు చేసుకున్నారు. 114 మంది ఎన్‌రోల్‌మెంటు చేసుకున్నా.. దరఖాస్తులు మాత్రం రెండే రావడం గమనార్హం. మంగళవారం సాయంత్రం 5గంటలకు దరఖాస్తు గడువు ముగుస్తుంది. ఆ తరువాత లాటరీద్వారా బార్లు కేటాయిస్తారు. అయితే ఒక్కో షాపునకు నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ తీస్తారు. దరఖాస్తు చేసుకోవాలంటూ పాత బార్ యజమానులను ఎక్సైజ్‌శాఖ అధికారులు బతిమాలుతున్నట్లు చెబుతున్నారు. దరఖాస్తులు రాకపోతే ఎక్సైజ్‌శాఖ గడువు పెంచడమో లేక ప్రభుత్వం మళ్లీ పాలసీపై పునరాలోచన చేస్తుందన్న నమ్మకంతో వ్యాపారులున్నారు. మంగళవారం సాయంత్రం వరకు గడువు ఉండటంతో దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్‌శాఖ భావిస్తోంది.

ఫ్రీహోల్డ్ ఉచ్చులో...

26,772 ఎకరాలు

- ఆగిన రిజిస్ట్రేషన్లు
- గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదుల వెల్లువ
- ప్రభుత్వ నిర్ణయం కోసం రైతుల నిరీక్షణ



కడప కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో తప్పుల తడకతో చేపట్టిన రీ సర్వే పుణ్యామా అని... పట్టా భూముల రైతులకు తిప్పలు తప్పడం లేదు. 2020లో జిల్లాలో చేపట్టిన రీసర్వేలో నిషిద్ధ జాబితా నుంచి భూములను తప్పించే విషయంలో అవకతకవలు చోటు చేసుకున్నాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా 26,772 ఎకరాలను రైత్వారీ పట్టాలతో సాగు చేసుకుంటున్న రైతులు ఫ్రీహోల్డ్ ఉచ్చులో పడ్డారు. 20 ఏళ్ల కిందట పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేసేందేకు గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన పాలసీనీ చక్కదిద్దేందుకు కూటమి సర్కారు పడరాని పాట్లు పడుతోంది. వైసీపీ హయాంలో అడ్డగోలు రీసర్వేతో పాటు, ప్రభుత్వ నిబంధనలకు పాతర వేస్తూ వేలాది ఎకరాలకు ఫ్రీహోల్డ్ క్లీన్ చిట్ పొందేందుకు ఆపార్టీలో పెద్దలు తతంగమే నడిపారు. 20 ఏళ్ల దాటిన అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేసి పబ్బం గడుపు కునేందుకు ఎత్తు గడ వేశారు. వీరి ఆటలకు తోడు రెవెన్యూ అధికారుల పాత్ర కూడా అప్పట్లో శ్రుతి మించిందనే చెప్పవచ్చు. ఈ నేపధ్యంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో 22(ఏ) నిషేధిత జాబితా నుంచి జిల్లా వ్యాప్తంగా 76,280.84 ఎకరాలకు రెవెన్యూ అధికారులు జాబితాను సిద్ధం చేశారు. తప్పుల తడకగా రూపొందిన ఆ భూములకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే విషయంలో చంద్రబాబు సర్కారు ఇప్పటికే 3 పర్యాయాలు సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితి వచ్చిందంటే ఫ్రీహోల్డ్ భూములు చిట్టా విప్పేకొద్దీ తప్పుల తడకగానే భావించాల్సి వస్తోంది. సెప్టెంబరు మొదటి వారం నాటికి ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారం తేల్చే పనిలో సీసీఎల్‌ఏ అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు.

జిల్లాలో సర్వీసు ఇనామ్ భూములు 26,772 ఎకరాలు

బ్రిటీష్ పాలనలో జమీందారీ వ్యవస్థ సాగేది. అప్పట్లో మంగళి, చాకలి, వెట్టి తదితర కుల వృత్తుల వారి సేవలకు సర్వీసు ఇనామ్ భూములు ఇచ్చారు. 1952-56 మధ్య కాలంలో సర్వీసు ఇనామ్ భూములను రద్దు చేస్తూ చట్టం వచ్చింది. దీంతో అప్పట్లో జమీందారు పరిధిలో ఉన్న ఇనామ్ భూముల్లో కౌలు రైతులకు 1/3 వంతు, జమీందారులకు 2/3 వంతున సర్వీసు ఇనామ్ భూములు ఇవ్వడం జరిగింది. ఆ భూములు కాల క్రమేణా రైత్వారీ పట్టా భూములుగా మారాయి. క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరిగాయి. కానీ వైసీపీ పాలనలో చేపట్టిన రీసర్వే పుణ్యమా అంటూ ఈ భూమున్నీ సర్వీసు ఇనామ్ భూములంటూ నిషిద్ధ జాబితాలో 26,772 ఎకరాల భూములను ఎక్కించారు. దీంతో జిల్లాలో రైతులు లబోదిబోమంటూ తమ భూములను నిషేద్ధి జాబితా నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వానికి, కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు పిర్యాదులు చేస్తున్నారు.

కడప, బద్వేలు డివిజన్ల పరిధిలో...

జిల్లాలో అన్ని మండలాల్లో సర్వీసు ఇనామ్ భూములు ఉన్నాయి. ముఖ్యంగా కడప, బద్వేలు డివిజన్ పరిధిలో ఈ భూములు ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. పెండ్లిమర్రి, వల్లూరు తదితర మండలాల్లో 4వేల ఎకరాలకు పైగా పట్టా భూములు సర్వీసు ఇనామ్ భూములుగా మార్చడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నాళ్ల పాటు పంటల సాగుతో పాటు తమ పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఆర్థిక ఇబ్బందుల అవసరాల కోసం భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరిగాయి. ఇపుడు అలాంటి భూముల రిజిస్ట్రేష న్లు ఆగిపోవడంతో కొనుగోలు చేసిన వారు తమ డబ్బు వెనుక్కు ఇవ్వమని గొడవలకు దిగుతున్నారని రైతులు లబోదిబోమంటున్నారు. 70 ఏళ్ల కిందట ఆర్‌ఎస్‌ఆర్ రెవెన్యూ రికార్డుల్లో సర్వీసు ఇనామ్ భూములుగా ఉందంటూ రీసర్వే సాకుతో పట్టా భూములను ఇనామ్ కేటగిరీలో 22(ఏ)లో చేర్చడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైత్వారీ పట్టా లుగా ఉన్న భూములను ఇనామ్ జాబితా నుంచి తొలగించాలంటూ గగ్గోలు పెడుతూ పలు పర్యాయాలు కలెక్టర్లకు మొర పెట్టుకున్నారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్లు ఎప్పటి కప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములను ఫ్రీహోల్డ్ జాబితా నుంచి తొల గించాలంటూ ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 26,772 ఎకరాలకు సంబంధించిన జాబితాను సీసీఎల్‌ఏ అధికారులకు నివేదించారు. బ్రిటీష్ జమానాలో ఇచ్చిన ఈ భూములు పట్ట ణాలు, జనవాసాలకు అనువుగా మారాయి. బద్వేలు, కడప, ప్రొద్దుటూరు, పులివెందుల డివిజన్ పరిధిలో ఈ భూముల ధరలు అమాంతం పెరిగాయి. అప్పట్లోనే పేదల చేతుల నుంచి కౌలు పేరుతో సాగు చేస్తున్న పెద్దలు ఈ భూములను తమకు అనుకూలంగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. దర్జాగా అనుభవిస్తున్నారు. ఈ భూముల క్లియిరెన్స్ విషయంలో కూడా ప్రభుత్వం లబ్ధిదారునికా.. అనుభవం దారునికా.. హక్కులు అనే విషయంలో నిర్ణయం తీసుకొనే అవకాశాలు లేక పోలేదంటారు. ,

వ్యత్యాసాలున్న భూములు 12,416 ఎకరాలు

ఫీహ్రోల్డ్ భూముల మాటున జిల్లాలో ఇంకా సక్రమైన రికార్డులు లేని, వ్యత్యాసాలు గల భూములు దాదాపు 12,416.62 ఎకరాలు వరకు ఉన్నట్లు ఫ్రీహోల్డ్ జాబితాలో స్పష్ట మవుతోంది. ఇప్పటి వరకు 20 సంవత్సరాలు దాటని అసైన్డు భూములు 30,943.82 ఎకరాలు, ఇనాం భూములు 26,772.60 ఎకరాలు, చుక్కల భూములు 18,359.25 ఎకరాలు, షరతుల పట్టా భూమి 5.12 ఎకరాలు వెరసీ మొత్తం 76,280.84 ఎకరాల ఫ్రీహోల్డ్ జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టరేట్ అధికారులు నివేధించారు తుది నిర్ణయం వచ్చే నెలలో వెలువడే అవకాశాలున్నట్లు రెవెన్యూ అధికారుల సమాచారం.

వినాయకుడిలా.. విద్యార్థులు



గణనాథుడి ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

కలసపాడు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కలసపాడులోని సెయింట్ ఆంటోని ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు సోమవారం వినాయకుడి విగ్రహం ఆకారంలో కూర్చుని అందరిని ఆకట్టుకున్నారు. బుధవారం వినాయక చవితి పండుగను పురస్కరించుకుని విద్యార్థులు ఇలా విన్యాసం చేశారు.

28 నుంచి డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని బాలాజీనగర్ ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో 28వ తేదీ నుంచి ఉపాధ్యాయుల నియామకానికి సంబంధించి మెగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన ఉదయం 8 గంటలకు ప్రారంభం అవుతుందని చెప్పారు. సమాచారం అందుకున్న అభ్యర్థులు సర్టిఫికెట్స్ పరిశీలనకు హాజరుకావాలని సూచించారు.

ఇవి తప్పనిసరి

అభ్యర్థులకు వారి వ్యక్తిగత మెగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందజేస్తారు. కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకుని అందులో పేర్కొన్న సూచనలు అనుసరించాలి. కాల్ లెటర్లు పొందిన అభ్యర్థులు ఇటీవల తీసుకున్న కుల ధ్రువీకరణ పత్రం, పోస్టులకు సంబంధించిన అర్హతల ఆధారంగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ స్కాన్డ్ కాపీలను తయారు చేసుకోవాలి. వెరిఫికేషన్‌కు రాకముందే అభ్యర్థులు వ్యక్తిగత లాగిన్‌లో అవసరమైన సర్టిఫికెట్స్ స్కాన్డ్ కాపీలను అప్‌లోడ్ చేసుకోవాలి. అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లు 3 సెట్లు నకలు కాపీలు చేసుకుని గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించుకోవాలి. ఈ మూడు సెట్లతో పాటు ఐదు ఫొటోలను అన్ని ఒక ఫైల్ ఫోల్డర్‌లో ఉంచుకుని హాజరుకావాలి.

ఆన్‌లైన్ అర్జీలను పట్టించుకోరా?

48గంటల్లో అధికారులు వివరణ ఇవ్వాలి ● కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చాలా శాఖలకు సంబంధించి సమస్యలపై బాధితుల నుంచి వస్తున్న ఆన్‌లైన్ అర్జీలను పట్టించుకోరా? ఇంత నిర్లక్ష్యమైతే చర్యలు తప్పవు.. దీనిపై 48 గంటల్లో వివరణ ఇవ్వండి అని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, అధికారులకు అర్జీలు సమర్పించారు. వారి సమస్యలు తెలుసుకుంటూ తదుపరి చర్యలకై సంబంధిత శాఖలకు తక్షణమే నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్, జేసీ సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను పరిష్కరించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫిర్యాదుదారుల అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి విచారణ చేపట్టాలన్నారు. విచారణ నాణ్యంగా, పారదర్శకంగా అర్జీదారులు సంతృప్తి చెందేలా ఉండాలన్నారు. పీజీఆర్ఎస్‌లో రీఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలన్నారు. చాలా మంది అధికారులు అర్జీలు చూడకుండా సమస్యలను పెండింగ్‌లో పెడుతున్నారు. రెండు రోజుల్లో పరిష్కరించకపోతే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఎస్డీసీ వెంకటపతి, జిల్లా అధికారులు కిరణ్‌కుమార్, రాజ్యలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను వినియోగించి

పర్యావరణాన్ని కాపాడాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గణేశ్ ఉత్సవాల్లో మట్టి వినాయక ప్రతిమలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మట్టివిగ్రహాల వాడకాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో అవగాహన పెంచేలా రాష్ట్ర పర్యావరణ నియంత్రణ మండలి రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు కలెక్టర్‌కు మట్టి వినాయకుడి ప్రతిమను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ ప్రజల్లో పూర్తి అవగాహన పెంచేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడడం వల్ల చెరువులు, నదులు, ఇతర జల వనరులు కాలుష్యం అవుతున్నాయన్నారు. ఎన్నోరకాల జీవరాశులకు ప్రాణహాని కలుగుతోందన్నారు. ఈ విపత్తును నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ అవగాహనతో గణేశ్ ఉత్సవాల్లో మట్టి విగ్రహాలను వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యావరణ ఇంజనీరు సుధాకర్ కురుబ, జడ్పీ సీఈవో ఓబులమ్మ, పశుసంవర్ధకశాఖ అధికారిణి శారద, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి పదవులు ఇవ్వాలి

- పార్టీ పదవుల్లో కడప జిల్లాను ప్రత్యేకంగా చూడాలి
- పరిశీలకుల ఎదుట టీడీపీ నేతలు
- అధ్యక్ష పదవి కోసం పలువురు ఆసక్తి



కడప పార్లమెంటు విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర.. చిత్రంలో ఎమ్మెల్యేలు జయనాగేశ్వరరెడ్డి, ఆర్.మాధవి, వరదరాజులరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, బీటెక్ రవి తదితరులు

(కడప-ఆంధ్రజ్యోతి): "ఇది మాజీ సీఎం జగన్‌మోహన్‌డ్డి సొంత జిల్లా. నిన్నటి ఎన్నికల్లో కార్యకర్తలంతా కష్టపడి పార్టీని గెలిపించుకున్నారు. కార్పొరేషన్ పదవుల్లో కడప జిల్లాను ప్రత్యేకంగా చూడాలి. కష్టపడ్డవారికి పదవులు ఇవ్వాలి" అని పలువురు టీడీపీ నేతలు పరిశీలకులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కడప నగరంలోని హరిత హోటల్‌లోని సమావేశ మందిరంలో కడప పార్లమెంటు టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పార్లమెంటు కొత్తకమిటీలను త్వరలోనే నియమించనున్నారు. ఇందులో భాగంగా కార్యకర్తల అభిప్రాయాల సేకరణ, ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు కడప పార్లమెంటుకు నాదెండ్ల బ్రహ్మం చౌదరి, బీద రవిచంద్ర, బీవీ జయనాగేశ్వర్‌రెడ్డిలను పరిశీలకులుగా నియమించారు. వీరు కడపకు వచ్చి తొలుత హరిత హోటల్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు పుత్తా నరసింహారెడ్డి, ఆర్.శ్రీనివాసరెడ్డి, భూపేశ్‌రెడ్డి, రితీశ్‌రెడ్డి, బీటెక్ రవి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు హోరాహోరీగా పోరాడి పార్టీని గెలిపించారని అన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు జిల్లాలోని వైసీపీ నేతలకు నాలుగు ఎమ్మెల్సీ పదవులు, కార్పొరేషన్ పదవులు, డైరెక్టర్లు పెద్దఎత్తున ఇచ్చారన్నారు. ఒక్కో నియోజకవర్గానికి నాలుగు చొప్పున ఇచ్చి పెద్దపీట వేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు సారథ్యంలో ప్రభుత్వం ఏర్పడి ఒకటిన్నర సపంవత్సరం అవుతున్నా పదవులు ఇవ్వలేదన్నారు. కడపపై ప్రత్యేక దృష్టి పెట్టి కష్టపడ్డ కార్యకర్తలందరికీ పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కడప, బద్వేలు, పులివెందుల మార్కెట్‌యార్డు కమిటీల నియామకాలలో ఆలస్యం జరుగుతోందని వాపోయారు. కార్యకర్తల సంక్షేమం గురించి పుత్తానరసింహారెడ్డి మాట్లాడడంతో కార్యకర్తలంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పుత్తాచైతన్యరెడ్డి, ఆర్.మాధవి, నేతలు అమీర్‌బాబు, ఎన్.కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష పదవి కోసం పోటాపోటీ

కడప పార్లమెంటుకు త్వరలో నూతన కమిటీని ప్రకటించనున్నారు. పార్లమెంటు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులను టీడీపీ అధినేత సీఎం చంద్రబాబునాయుడు ప్రకటిస్తారు. అయితే ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు కమిటి సభ్యులు బ్రహ్మంచౌదరి, బీద రవిచంద్ర, జయనాగేశ్వర్‌రెడ్డి వచ్చారు. ప్రస్తుత అధ్యక్షుడుగా ఉన్న ఆర్.శ్రీనివాసరెడ్డి మరలా అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. ఇక గోవర్దనరెడ్డి, భూపేశ్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు, లింగారెడ్డి, రితీశ్‌రెడ్డి జిల్లా అధ్యక్ష పదవి కావాలని అడిగినట్లు సమాచారం. సామాజిక న్యాయం చేయాలంటే బలిజలకు అధ్యక్ష పదవి ఇవ్వాలని హరిప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కడప బలిజ సంఘం నేతలు కూడా హరిప్రసాద్‌కే ఇవ్వాలని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. మొత్తానికి అధ్యక్ష పదవి కోసం ఆశావహులు పెద్ద సంఖ్యలో పోటీపడుతున్నారు.

పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు

7

ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కారవేది కలో స్వీకరించే ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరం న్యాయం చేయాలని ఆదేశించారు.

యూరియా కొరత సృష్టిస్తే కేసులు

- విజిలెన్స్, పోలీసు అధికారుల హెచ్చరిక

7

ఘనంగా గంధం మహోత్సవం

దానిమ్మకు వైరస్ పోటు

- నల్లగా మాడిపోయి రాలిపోతున్న కాయలు
- మందులకు లొంగని రోగం.. తోటలను వదిలేసిన రైతులు
- దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం





పాత ములకలచెరువు వద్ద వైరస్‌లతో వదిలేసిన దానిమ్మ తోటలు

ములకలచెరువు / పెద్దతిప్పసముద్రం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మాయదారి వైరస్.. దానిమ్మ రైతులను నిండా ముంచి ంది. బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్‌ల దెబ్బకు చెట్లలోని కాయలు నల్లగా మాడిపోయి రాలిపోతున్నాయి. ఎన్ని మందులు కొట్టినా లొంగడం లేదు. వైరస్ తగ్గకపోవడంతో ఏం చేయలేక తోటలను వదిలేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దానిమ్మ రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. వాతారణంలో మార్పులు...ముసురు వానతో ఎన్నడూ లేనంతగా వైరస్ విజృంభించింది. ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మ ధరలు బాగా ఉన్నా రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. కంటికి రెప్పలా కాపాడుకున్న తోటలు వైరస్‌ల బారిన పడి కళ్లముందే మాడిపోయి రాలిపోతుండడంతో రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వైరస్‌ల కారణంగా దానిమ్మ రైతులకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది.

తంబళపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, పెద్దతిప్పసముద్రం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో దానిమ్మ తోటలు ఉన్నాయి. ఎకరాకు రూ.1.50 లక్ష నుంచి రూ.1.80లక్షల వరకు ఖర్చు చేసి తోటలను సాగు చేశారు. ఈ తోటలు ప్రతి ఏటా దిగుబడి ఇస్తున్నాయి. సహజంగా ప్రతి ఏటా వేసవి తరువాత జూన్ నెల నుంచి నెల నుంచి రైతులు పూత నిలబెడతారు. పూత నిలిపేందుకు మందులు, ఎరువులు వాడాల్సి ఉంటుంది. ప్రతి ఏటా ఎకరాకు రూ.లక్షకుపైగా ఖర్చు వస్తుంది.

ఎంతో ఆశతో రైతులు ఈ ఏడాది పూతను నిలిపి మందులు పిచికారి చేశారు. ఎరువులు కూడా వాడారు. తీరా కాయలు చేతికొచ్చే సమయంలో ముసురు వానలు, వాతావరణంలో మార్పుల కారణంగా దానిమ్మ తోటలు వైరస్ బారిన పడ్డాయి. అన్ని తోటలపై బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్ దాడి చేశాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రెండు వైరస్‌లు విజృంభించడంతో ప్రతి చెట్టులోని కాయలు నల్లగా మాడిపోవడంతో పాటు పగిలిపోయి రాలిపోతున్నాయి. రైతులు ఎన్ని మందులు కొట్టినా వైరస్‌లు తగ్గడం లేదు. వైరస్‌లు తగ్గకపోవడంతో కొందరు రైతులు తోటలను వదిలేశారు. ఎక్కడ చూసినా వైరస్‌ల బారిన పడ్డ తోటలే దర్శనమిస్తున్నాయి.

ధర బాగున్నా...

ప్రస్తుతం మార్కెట్‌లో దానిమ్మ ధర బాగున్నా ప్రయోజనంగా లేకుండా పోయింది. దానిమ్మ తోటలు వైరస్‌ల బారిన పడడంతో దిగుబడి ఏమాత్రం లేకుండా పోయింది. మార్కెట్‌లో టన్ను దానిమ్మ ధర రూ.లక్ష వరకు ఉంది. ఇక్కడి దానిమ్మ కాయలకు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండేది. గత ఏడాది దానిమ్మ దిగుబడి బాగా వచ్చింది. కానీ ధర అంతంతమాత్రంగా ఉండడంతో రైతులు నష్టపోయారు. ఈ ఏడాది వైరస్‌ల కారణంగా దిగుబడి లేకపోవడంతో రైతులకు కోలుకోలేని దెబ్బతగిలింది.

సగానికి తగ్గిపోయిన తోటలు

తంబళ్లపల్లె నియోజకవర్గంలో దానిమ్మ తోటలు సగానికి తగ్గిపోయాయి. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో రెండు వేల ఎకరాల వరకు దానిమ్మ తోటలు ఉండేది. ప్రతి ఏటా పెట్టబడులు పెరుగుతుండడంతో పాటు వైరస్‌లతో నష్టాలు వస్తుడడంతో రైతులు తోటలను తొలగించడంతో సగానికి తగ్గిపోయాయి. ఇటీవల ములకలచెరువు మండలం కోటిరెడ్డిగారిపల్లె, గూడుపల్లె, పెద్దతిప్పసముద్రం మండలం కురవవాండ్లపల్లె తదితర గ్రామాల్లో సుమారు 50 ఎకరాల దానిమ్మ తోటలను రైతులు తొలగించి ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అలాగే ములకలచెరువు మండలం నాయనిచెరువుపల్లె వద్ద 10 ఎకరాల దానిమ్మ తోటను పూత నిలపకుండా వదిలేశారు.

ఉద్యాన రైతులకు వరుస దెబ్బలు

ఉద్యాన పంటలు సాగుచేస్తున్న రైతులకు వరుస దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. ఈ ఏడాది దోస సాగు చేసిన రైతులు వైరస్‌ల కారణంగా కాయలు సైజులు రాక, మచ్చలు వచ్చి దెబ్బతిని నష్టపోయారు. నియోజకవర్గంలో సుమారు 800 ఎకరాలకుపైగా దోస పంట వైరస్ బారిన పడడంతో రైతులకు తీవ్ర నష్టం వచ్చింది. అలాగే ఖర్బూజ పంట కూడా వైరస్‌ల బారిన పడింది. తాజాగా దానిమ్మ తోటలను కూడా వైరస్‌లు దెబ్బతీశాయి.

తేమ కారణంగా వైరస్

ముసురు వానలు వస్తుండడంతో తేమ శాతం అధికంగా ఉండడం వలన కాయాల్లో నల్ల మచ్చలు ఏర్పడి వైరస్ సోకుతోంది. దానిమ్మ పంటకు తక్కువ మోతాదులో నీరందించాలి. ఒక్క శాతం బోర్డు మిశ్రమాన్ని నీటిలో కలిపి పిచకారీ చేయాలి. కోతకు వచ్చే సమయంలో పంటకు రైతులు అజాక్సిస్ట్రాన్ అనే క్రిమిసంహారక మందును లీటర్ నీటిలో ఒక్క గ్రాము కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుంది.

- భీమేశ్, ఉద్యానశాఖ అధికారి, ములకలచెరువు

మందులు కొట్టినా తగ్గలేదు



ఆరు ఎకరాల్లో దానిమ్మ సాగు చేశాను. రూ.10లక్షల వరకు ఖర్చు చేశాను. ఇప్పుడు మూడో ఏడాది పూత నిలిపాను. ప్రస్తుతం ఎకరాకు రూ.లక్ష వరకు ఖర్చు చేశాను. కాయలు చేతికొచ్చే సమయంలో గత నెలలో కురిసిన ముసురు వానతో భూమిలో తేమ ఎక్కువై బ్లైట్, ఆంత్రా కోస్ వైరస్‌లు సోకాయి. గుజరాత్ రాష్ట్రం నాసిక్ నుంచి మందులు తెప్పించి కొట్టినా ప్రయోజనం లేదు.

- కిరణ్‌కుమార్, గూడుపల్లె, ములకలచెరువు మండలం

ఎన్నడూ లేనంతగా వైరస్ సోకాయి



11 ఎకరాల్లో దానిమ్మ తోట ఉంది. నాలుగోసారి పూత నిలిపాను. వాతారణంలో మార్పులు, ముసురు వానతో గతంలో ఎన్నడూ లేనంతగా వైరస్‌లు సోకాయి. కాయలన్నీ నల్లగా మాడిపోవడంతో పాటు పగిలిపోయి రాలిపోతున్నాయి. మందులు పిచికారి చేసినా ప్రయోజనం లేదు. చేసేదిలేక తోటను వదిలేశాను. ఈ ఏడాడి దిగుబడే లేదు. మార్కెట్‌లో ధర బాగా ఉన్నా నిరాశే మిగిలింది.

- శేషారెడ్డి, పాత ములకలచెరువు

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అజెండా అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం తన స్వగ్రామమైన బోరెడ్డిగారిపల్లెలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి తక్షణమే అక్కడికక్కడే అధికారులకు ఫోన్ చేసి సకాలంలో సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పడమటికోన గ్రామం వడ్డెపల్లెలో నూతనంగా వెలసిన శివాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు మంత్రిని గజమాలతో ఘనంగా సత్కరించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పాటూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

నందలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 24న జరిగిన జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చమర్తి సుదర్శన్‌రాజు మాట్లాడుతూ బాల్‌బ్యాడ్మింటన్ సెలక్షన్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎం.యేసుప్రియ, ఎస్.మన్సూర్ ఎంపికయ్యారని, తమ పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 29, 30, 31వ తేదీల్లో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీ సుస్మిత, పీఈటీ జగన్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.


చక్రంపేట విద్యార్థి ...



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెనగలూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలకు చెందిన సి.గురుచరణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం రాజంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో జరిగిన జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో గురుచరణ్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. సోమవారం పాఠశాలలో ఉపాధ్యాయ బృందం గురుచరణ్‌ను అభినందించి జ్ఞాపిక అందజేశారు.

కలికిరి విద్యార్థిని...



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న జి.నిత్యశ్రీ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనడానికి ఎంపికయినట్లు హెచ్‌ఎం జయశ్రీ తెలిపారు. ఆదివారం మదనపల్లె గ్రీన్‌వ్యాలీ స్కూల్‌లో జూనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో పాల్గొన్న నిత్యశ్రీ బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది. సెప్టెంబరు 13, 14, 15వ తేదీల్లో నెల్లూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ అమ్మాయి జిల్లా తరపున ఆడనుంది. ఈ సందర్భంగా నిత్యశ్రీకి శిక్షణ ఇచ్చిన పీడీ టి.చిన్నప్ప, విజేతగా నిలిచిన నిత్యశ్రీలను హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- **జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ, అదనపు ఎస్పీ, తదితరులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాదక ద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారినపడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటి వరకు 530 ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే 430 ఈగల్ క్లబ్స్‌ను ఏర్పాటు చేశామని, త్వరితగతిన మిగతా స్కూల్స్‌లో పూర్తి స్థాయిలో ఈగల్ క్లబ్స్ ఏర్పాటు చేసి ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ ఇంకా అవగాహన కార్యక్రమాలు పెంచాలని తెలిపారు.

మందుల షాపుల్లో డాక్టర్ రాసిన చీటీలు లేకుండా మందులు ఇవ్వరాదని, తరచూ మందుల షాపులను తనిఖీ చేయాలని డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ జిల్లాలో పోలీసుశాఖ వారికి ఇప్పటికే 735 అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని, ఇంకా ఈ కార్యక్రమాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 882 కేసులు పెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే సీసీ టీవీ, డ్రోన్ల ద్వారా పర్యవేక్షించడం జరుగుతోందని తెలిపారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఏఈఎస్ జోగేంద్ర, డీఎస్పీ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలవండి : ఎస్పీ



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే బాధితులకు పోలీసు అధికారులు అండగా నిలవాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్వయంగా విన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బాధితుల సమస్యలను చట్టపరంగా, వీలైనంత త్వరగా పరిష్కరించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందని తెలిపారు. ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడిన ఎస్పీ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుల్లో ముఖ్యంగా కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, కుటుంబ సభ్యుల వేధింపులు, భూవివాదాలు, నకిలీపత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమ పేరుతో మోసాలు లాంటివి ఉన్నాయన్నారు. ప్రతి ఫిర్యాదుపై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ ద్వారా నేరుగా ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదు దారులకు న్యాయం చేయండి, బాధితులకు బాసటగా నిలవాలని, చట్ట పరిమితుల్లో మానవీయంగా స్పందించండని ఎస్పీ సూచించారు. వృద్ధులు, వికలాంగులు, మహిళల ఫిర్యాదులకు ప్రాముఖ్యత నిస్తూ సమగ్రంగా విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు.

శాంతియుతంగా జరుపుకోండి

- **జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్**

రాయచోటి (నేతాజీ సర్కిల్), ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ శాంతియుతంగా జరుపుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన వినాయక చవితి పండుగను శాంతియుతంగా సంప్రదాయబద్ధంగా నిర్వహించుకునేందుకు అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి, మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణిలతో కలిసి శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పండుగ సమయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

పండుగ రోజుల్లో నిరంతరం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని, ఆయా సంబంధిత అధికారులను సూచించారు. అడిషినల్ ఎస్పీ వెంకటాద్రి మాట్లాడుతూ విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాల్లో రాత్రిపూట కమిటీ సభ్యులు వలంటీర్లను నియమించుకోవాలని తెలియజేశారు. సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, డీపీవో, కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పండుగ కమిటీ ప్రతినిధులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పాడి ఆవుల యజమానికి పరిహారం విడుదల

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటు కారణంగా మృతి చెందిన రెండు పాడి ఆవుల యజమానికి పరిహారం విడుదల చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ములకలచెరువు మండలం సోంపల్లెకు చెందిన బీమిశెట్టి మస్తానప్పకు చెందిన రెండు పాడి ఆవులు ఏప్రిల్ 30న పిడుగుపాటుకు గురై మృతి చెందాయి. దీనిపై జూలై 25న కలెక్టరు పరిహారం విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పరిశీలించిన ప్రభుత్వం రెండు పాడి ఆవులకు రూ.75 వేలు మంజూరు చేసింది. రైతు బ్యాంకు ఖాతాకు జమ చేయాలని కలెక్టరును ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

బార్ల దరఖాస్తుకు నేడు చివరి గడువు

రాజంపేట టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ఎక్సైజ్ శాఖ పరిధిలో ప్రభుత్వం రెండు బార్‌ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.మల్లిక ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బార్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల వారు మంగళవారం సాయంత్రం 5 గంటల లోపు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా గాని, దరఖాస్తు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నీటి సంపులో పడి చిన్నారి మృతి



కురబలకోట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి చిన్నారి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది.. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని విశ్వం కళాశాల పక్కనున్న పెద్దకటవకు చెందిన చిన్నప్పరెడ్డి, భార్గవి దంపతులు బతుకుదెరువు నిమిత్తం మూడేళ్లుగా మదనపల్లె పట్టణం బసినికొండలో నివాసం ఉండేవారు.

ఈ క్రమంలో తన కుమారుడు శ్యాంకృష్ణ(2)తో కలిసి ఈనెల 11న స్వగ్రామానికి వెళ్లారు. అయితే ఆరోజు రాత్రి ఇంటి ఆవరణలో బాలుడు ఆడుకుంటూ అనంతరం కనిపించకుండా పోయాడు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. మరుసటి రోజు నీటి సంపులో బాలుడు శవమై కనిపించాడు.

ఇదిలా ఉండగా కుటుంబీకులకు తమ బిడ్డ మృతిపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి చిన్నారి మృతదేహానికి అక్కడికక్కడే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ఆటో కాల్చివేత



రైల్వేకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబనపల్లె దళితవాడ గ్రామం లో ఈ నెల 22న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కనుపర్తి రాజేంద్ర కు చెందిన ఆటోను నిప్పంటించారు. దీంతో ఆటో పూర్తిగా కాలిపోయింది. సోమవారం బాధితుడు పోలీసులకు పిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆటోతోనే తన బతుకుదెరువు అని వాపోయాడు. తనకు గ్రామం లో ఎవరితోను శత్రుత్వం లేదన్నాడు. కానీ ఎందుకు నా ఆటోను కాల్చివేయాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేసి తనకు న్యాయం చేయాలని కోరుతున్నాడు.

పాముకాటుకు గురైన రైతు

రైల్వేకోడూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామానికి చెందిన తిరుపతి చంద్రశేఖర్ అనే రైతు తన పొలంలో సోమవారం పనులు చేసుకుంటుండగా పాము కాటేసింది. దీంతో గ్రామస్తులు హుటాహుటిన రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేసి ఎలాంటి ప్రమాదం లేదని చెప్పడంతో రైతు కుటుంబం ఊపిరి పీల్చుకుంది.

పాలకొండల్లో అటవీ అధికారుల పహారా

శ్రీగంధం తీసుకెళుతున్న ఒకరి అరెస్ట్... ఇద్దరు పరారీ



పట్టుబడిన దుంగలు, వ్యక్తితో ఫారెస్ట్ అధికారులు

సిద్దవటం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో సోమవారం పహారా కాస్తుండగా శ్రీగంధం తీసుకెళుతున్న ఒకరిని అరెస్ట్ చేశామని, మరో ఇద్దరు పరారైనట్లు కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. భాకరాపేట సెక్షన్ సిబ్బంది, పాలకొండ రిజర్వు అటవీ ప్రాంతంలో ముగ్గురు వ్యక్తులు శ్రీగంధం దుంగలతో వెళుతూ కనిపించారన్నారు. అటవీశాఖ సిబ్బంది వారి వెంటపడగా ఇద్దరు పరారయ్యారని, ఒకరిని పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వ్యక్తి చిత్తూరు జిల్లాకు చెందిన ఎస్.విశ్వనాథ్‌గా నిర్ధారించామన్నారు. పట్టుబడిన వ్యక్తిని విచారించగా పరారైనవారిలో చిత్తూరు జిల్లాకు చెందిన కొత్తకోట సురేంద్ర, చంద్ర అనే వ్యక్తులు ఉన్నారని చెప్పాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచామన్నారు. పరారైన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో భాకరాపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్.రాజశేఖర్‌రాజు, భాకరాపేట బీట్ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పి.ఇంద్ర, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ జి.కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.1.7 లక్షల విరాళం



అన్నదాన ట్రస్టు సభ్యులకు చెక్కును అందచేస్తున్న దాతలు

తంబళ్లపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లెకు సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండ మల్లికార్జునస్వామి సేవా సమితి అన్నదాన ట్రస్టుకు ఓ దాత రూ.1.7 లక్షలు విరాళం అందజేశారు. సోమవారం మండలంలోని ఎర్రసానిపల్లె సర్పంచ్ సుగుణ, వీరభద్ర దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి అన్నదాన ట్రస్టు వైస్ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి నారాయణరెడ్డి, ట్రస్టు సభ్యులకు రూ.1.7లక్షల చెక్కును అందచేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.. మల్లయ్యకొండకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్నదాన ట్రస్టులో పాలు పంచుకోవడం తమ అదృష్టమన్నారు. అన్నదాన ట్రస్టు సభ్యులు, స్థానిక నాయకులు దాతల దాతృత్వాన్ని అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము దివ్యాంగులం కాదా సారూ...!

- సామాన్యులే మమ్మల్ని అవిటివారిగా గుర్తిస్తారు..
- డాక్టర్లకు ఎందుకు అనిపించలేదో...
- మాకు న్యాయం చేసి ఆదుకోండి
- ఆవేదనతో ఆందోళనకు దిగిన దివ్యాంగులు



పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు



ఆందోళన చేస్తున్న దివ్యాంగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మమ్మల్ని చూస్తూనే మేము దివ్యాంగులమని సామాన్యులు కూడా గుర్తి స్తారు.. కానీ డాక్టర్లు మాత్రం మమ్మల్ని దివ్యాంగులుగా గుర్తించ లేదు... దీంతో మా పింఛన్లు పోయాయంటూ ఆందోళనకు దిగారు. సోమవారం పులివెందుల ఆర్డీఓ కార్యాలయం ఎదుట దాదాపు 50 నుంచి 60 మంది దివ్యాంగులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ చిన్నయ్య వారి వద్దకు వచ్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా దివ్యాంగులు ఆర్డీఓ ఎదుట తమ ఆవేదన వెలిబుచ్చారు. సారూ మేము దివ్యాంగులమని గతంలోనే డాక్టర్లు మాకు సర్టిఫికెట్లు ఇచ్చారు. ఈ సర్టిఫికెట్లతో ప్రభుత్వం దివ్యాంగు లుగా గుర్తించి పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ ఆగస్టు నెలలో ఇవ్వలేదు. ఎందుకు మాకు ఇవ్వలేదని ప్రశ్నిస్తే మీపేరు దివ్యాంగ పింఛన్ నుంచి తొలగించారని సచివాలయ సిబ్బంది చెప్పారు. దీంతో ఏమి చేయాలో అర్థం కావడం లేదు. గత కొన్ని నెలలుగా దివ్యాంగులకు సంబంధించిన వారందరినీ డాక్టర్లు పరిశీలించి ప్రభు త్వానికి నివేదిక ఇచ్చారు. ఈ నివేదికలో మేము దివ్యాంగులం కాదని డాక్టర్లు గుర్తించారంట, మమ్మల్ని చూస్తేనే దివ్యాంగులమని సామాన్యులకు కూడా తెలుస్తుంది. కానీ డాక్టర్లకు ఎందుకు మా పరిస్థితి అర్థం కాలేదో అని ఆర్డీవో ఎదుట వాపోయారు. మాకు న్యాయం చేయాలని కోరారు.

స్పందించిన ఆర్డీవో : దివ్యాంగుల బాధను, గోడును ఆలకించిన ఆర్డీవో వెంటనే స్పందించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు వివరిస్తామన్నారు. మరోసారి వైద్యపరీక్షలు చేయించేలా ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో దివ్యాంగులు ఆందోళన విరమించారు.

యూరియా కొరత సృష్టిస్తే కేసులు

- విజిలెన్స్, పోలీసు అధికారుల హెచ్చరిక



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

జమ్మలమడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులు అధిక ధరలకు యూరియా, ఇతర మందులు విక్రయించినా, కొరత సృష్టించినా కేసులు నమోదు చేస్తామనిఉమ్మ డి కడప జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, వ్యవసాయ విజిలెన్స్ అధికారి ఖాజాహుస్సేన్, డీఎస్పీ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. సోమవారం మధ్యాహ్నం జమ్మలమడుగు పట్టణంలో ఫర్టిలైజర్స్ దుకాణాలపై విజిలెన్స్, పోలీసు, వ్యవసాయ అధికారులు కలిసి దాడులు నిర్వహించారు. జమ్మలమడుగు ముద్దనూరు రోడ్డులోని ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సమాచారం తెలుసుకున్న కొందరు దుకాణాల యజమానులు మూత వేసినట్లు రైతుల ద్వారా తెలిసింది. వ్యవసాయశాఖ ఏడీ అనిత, స్థానిక వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అర్బన్ సీఐ నరేష్‌బాబు, ప్రొద్దుటూరు త్రీటౌన్ సీఐ కె.వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధం మహోత్సవం



గంధం మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని

కడప కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాతి గాంచిన కడప అమీన్‌పీర్ దర్గాలో ఆదివారం రాత్రి 10వ పీఠాధిపతి హజరత్ అమీన్ పీర్ మాలిక్ గంధం మహోత్సవం, సోమవారం ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి అరిఫుల్లా హుస్సేని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి గంధం సమర్పించారు. దర్గా ఆవరణం నుంచి హజరత్ అమీన్‌పీర్ మాలిక్ మజర్ వరకు గంధం ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు.

ఉరుసు మహోత్సవాలకు పలువురు రాజకీయ నాయకులు, పుర ప్రముఖులు, సినీప్రముఖులు హాజరయ్యారు. ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. రాత్రి 10 గంటలకు ప్రముఖ కవ్వాల్ మీరాజ్ వారిచే గొప్ప ఖవ్వాలి కార్యక్రమం నిర్వహించారు.

పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు



శిక్షపడిన ముద్దాయిలు

పూతలపట్టు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఇద్దరు యువకులకు బతికినంత కాలం జైలు శిక్ష విధిస్తూ చిత్తూరు న్యాయస్థానం సంచలన తీర్పు ఇచ్చింది. మదనపల్లెకి చెందిన 16 ఏళ్ల బాలిక.. 2019 నవంబరు 24వ తేదీన తిరుమలకు వెళ్లి దేవుడి దర్శనం చేసుకుంది. అదే రోజు రాత్రి తిరుపతికి చేరుకుని తిరుచానూరుకు నడిచివెళుతుండగా బైక్‌పై వస్తుండిన తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు సమీపంలోని బ్రాహ్మణపట్టుకు చెందిన చిత్తూరు వెంకటేష్ (34)ను లిఫ్ట్ అడిగింది. అతను బాలికను బైక్‌పై ఎక్కించుకుని తిరుచానూరులో దింపకుండా ముండ్లపూడి గ్రామం వైపు తీసుకెళ్లాడు. అక్కడున్న పొదలవద్ద బైక్‌ను ఆపి.. పెట్రోల్ అయిపోయింది.. తీసుకురమ్మని తన స్నేహితుడు బుక్కే రాజామోహన్ నాయక్ (34)కు ఫోన్‌చేసి చెప్పాడు. అతడు వచ్చాక రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇద్దరూ కలిసి బాలికను ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశారు. బాలిక వారి వద్ద నుంచి తప్పించుకుని రోడ్డుపైకి వచ్చి కాపాడండి అంటూ పెద్దగా కేకలు వేసింది. అటుగా వెళుతున్న పాదచారులు గమనించి, బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై బాలిక తల్లి తిరుచానూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు చిత్తూరులోని పోక్సో కోర్టులో సోమవారం వాయిదాకు రాగా న్యాయమూర్తి పూర్వాపరాలు పరిశీలించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయిలకు బతికినంతకాలం జైలు శిక్షతోపాటు వెంకటేష్‌కు రూ.17,500, రాజామోహన్ నాయక్‌కు రూ.13,500 జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించాలని న్యాయమూర్తి శంకర్‌రావు తీర్పునిచ్చారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహనకుమారి కేసును వాదించారు.

రూ.47లక్షల ఎరువుల అమ్మకాలు నిలుపుదల

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, పోలీస్, విజిలెన్స్ శాఖలు సంయుక్తంగా సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్ ఎరువులకు సంబంధించిన అమ్మకాలు కొనుగోలు వివరాలు, యూరియాకు సంబంధించిన స్టాక్ వివరాలు, రసీదులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పులివెందుల ఏడీఏ అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఏడు దుకాణాలలో పలు లోపాలను గుర్తించామన్నారు. సుమారు రూ.47 లక్షల విలువైన వివిధ రకాల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశామ న్నారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఏఓ చెన్నారెడ్డి, టెక్నికల్ ఏఓ సునీల్ కుమార్‌రెడ్డి, విజిలెన్స్‌శాఖ హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విరివిగా రుణాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్మన్ వీరాంజనేయులు

కడప రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) రైతులకు విరివిగా అన్ని రకాల రుణాలు అందించి తద్వారా ప్రభుత్వ లక్ష్యసాధనకు తోడ్పాటు అందించాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం ఆయన డీసీసీ బ్యాంకును ఆకస్మికంగా సందర్శించారు. సీనియర్ అధికారులు, బ్యాంకు సిబ్బందితో మాట్లాడి బ్యాంకు స్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాబ్ తరుపున డీసీసీ బ్యాంకు కు అన్ని రకాల ప్రయోజనాలు చేకూరుస్తామని... జిల్లా రైతాంగానికి అండగా నిలవాలన్నారు. అందుకు ఎన్ని కోట్లు రుణాలు కావాలన్నా మంజూరు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఉద్యోగ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ చైర్మన్ ఎం.సూర్యనారాయణరెడ్డి, సీఈవో రాజామణి, డీజీఎం ప్రతాప్‌రెడ్డి, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నారాయణరెడ్డి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో సత్తాచాటిన కడప క్రీడాకారులు



చెస్‌లో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

కడప స్పోర్ట్స్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వెంకటగిరిలో ఈనెల 24న జరిగిన ఆలిండియా వన్‌డే ఓపెన్ చెస్ టోర్నమెంటులో కడపకు చెందిన చెస్ క్రీడాకారులు సత్తాచాటినట్లు జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్‌దర్బారి వెల్లడించారు. ఇందులో దేశం నలుమూలల నుంచి సుమారు 265 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. వారిలో జిల్లాకు చెందిన 23 మంది చెస్ క్రీడాకారులు పాల్గొని అండర్-14 బాలికల విభాగంలో సరయూ ద్వితీయ స్థానం సాధించగా, అండర్-12 విభాగంలో లక్ష్మి 3వ స్థానం, అండర్-8 బాలుర విభాగంలో అర్హన్ తృతీయ స్థానం, అండర్ -10 బాలికల విభాగంలో అమీనా నాలుగోస్థానం, మహిళల విభాగంలో సబీహ 4వ స్థానం, ఓపెన్ విభాగంలో భగత్ 13వ స్థానం సాధించినట్లు తెలిపారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు



యోగ పోటీలకు హాజరై ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు తదితరులు

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో జిల్లాస్థాయి యోగా ఎంపిక పోటీలు అట్టహాసంగా జరిగాయి. జిల్లా యోగా అసోషియేషన్ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి తేజ ఆధ్వర్యంలో స్థానిక శ్లోక హైస్కూల్‌లో సోమవారం ఈ పోటీలు జరిగాయి. జిల్లాలోని కడప, పులివెందుల, తొండూరు, వేంపల్లె, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ తదితర ప్రాంతాల నుంచి పలువురు ఈ యోగా పోటీల్లో పాల్గొన్నారు. 70 మందికి పైగా ఈపోటీల్లో పాల్గొనగా పలువురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆయా వయసు గ్రూపులలో ఈ పోటీలు జరగ్గా విజేతలుగా నిలిచిన వారిని సెప్టెంబరు 6,7 తేదీల్లో తూర్పు గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త, శ్లోక కరస్పాండెంట్ నవనీశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేంద్ర చేతులమీదుగా విజేతలకు ప్రశంసాపత్రాలను అందించారు. పరిశీలకులు మనోహర్‌రెడ్డి, రెఫరీ కేశవ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వీఅండ్‌ఎస్ఎస్‌డబ్ల్యూఏ వర్కింగ్ ప్రెసిడెంటుగా రవి



కడప మారుతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): స్టేట్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్‌వీఅండ్ఎస్ ఎస్‌డబ్ల్యూఏ) నూతన వర్కింగ్ ప్రెసిడెంటుగా కడప డిపోలో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకొండ రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేట్ విజిలెన్స్ విభాగంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేం దుకు కృషి చేస్తానని వెల్లడించారు.

గల్లంతైన యువకుడి శవం లభ్యం

దువ్వూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లేళ్ల గ్రామానికి చెందిన నాదేళ్ల షఫిక్ (15) మృతదేహం సోమవారం తెల్లవారుజామున లభ్యమైంది. ఆదివారం కేసీ కాలువలో పడి షఫిక్ గల్లంతు అయిన విషయం విధితమే. మృతదేహం కోసం ఎంత వెతికినా కనిపించలేదు. ఈ నేపధ్యంలో పోలీసులు కేసీ అధికారులతో మాట్లాడి కాలువలో నీటిమట్టాన్ని తగ్గింపజేశారు. దీంతో ఏకోపల్లె సమీపంలో మృతదేహాన్ని గుర్తించి బయటికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, మృతిచెందిన షఫిక్ దువ్వూరు జడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు. సంఘటన గురించి తెలిసిన స్నేహితులు, ఉపాధ్యాయులు విషాదంలో మునిగిపోయారు. షఫిక్ మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి.

దాడి ఘటనపై పరస్పర ఫిర్యాదు

పులివెందుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణంలో సోమవారం ఉదయం 10గంటల ప్రాంతలో జరిగిన ఘటనలో ఇరువురు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం ఓ ఎలక్ట్రికల్ షాప్‌లో ఉన్న తనపై దాడి చేశారని పులివెందులకు చెందిన సుంకేసుల ఆదిశేషు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల జరిగిన జడ్పీటీసీ ఎన్నికలలో వైసీపీ తరపున ప్రచారం ఎందుకు నిర్వహించావని దూషిస్తూ తనపై ఆర్.తుమ్మలపల్లెకు చెందిన విశ్వనాథరెడ్డి, అతని అనుచరుడు తనపై దాడి చేశారని, ఈ ఘటనలో తన ఎడమ చేయి విరిగిందని ఆదిశేషు తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశానన్నారు. అలాగే సొంత పనిపై ఎలక్ట్రికల్ షాపునకు వెళ్లానని టీడీపీ నాయకుడు విశ్వనాథరెడ్డి అనుచరుడు మల్లెం శేఖర్ అనే వ్యక్తి తెలిపారు. అయితే ఆదిశేషు తనను కులంపేరుతో దూషించాడని... ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆదిశేషుపై చర్యలు తీసుకోవాలని మల్లెం శేఖర్ పోలీసులకు ఫిర్యాదు పత్రాన్ని అందించారు. ఈ పరస్పర ఫిర్యాదులుపై కేసు నమోదు వివరాలు తెలుసుకునేందుకు అర్బన్ సీఐ చాంద్‌బాషకు ఫోన్ చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ భూముల రిపోర్టును రద్దు చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కలమల్ల గ్రామస్థులు

ఎర్రగుంట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కలమల్లలో వెలసిన సిద్దేశ్వరస్వామి ఆలయ మాన్యం భూముల విషయంలో త్రిసభ్య కమిటీ నివేదికను రద్దు చేయాలని కలమల్ల గ్రామానికి చెందిన సిద్దేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఇల్లూరు రామప్రసాద్‌రెడ్డి, తారక రామారెడ్డి, గ్రామప్రజలు సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. సిద్దేశ్వరస్వామి ఆలయం 1943 నుంచి వుందని, ఆలయానికి 61.50 ఎకరాల భూమి ఉందన్నారు. ఆలయాన్ని ఆర్టీపీపీ నిర్మాణ దశలో పునర్నిర్మాణం చేశారన్నారు. అయితే గ్రామానికి చెందిన ఓ వర్గం వారు ఆలయానికి పేరు మార్చి అసత్యాన్ని సత్యంగా చూపించే ప్రయత్నం చేశారన్నారు. ఈ ఆలయాలకు సంబంధించి ఆర్డీవో, తహసీల్దార్, ఎండోమెంట్ ఏసీని రిపోర్టు ఇమ్మని కలెక్టర్ కోరారని... అయితే వారు గ్రామ ప్రజలందరితో సమావేశం నిర్వహించకుండా పూర్వ రికార్డులు పరిశీలించకుండా ఏకపక్షంగా రిపోర్టును ఇచ్చారన్నారు. గ్రామంలో 1992లో సంవత్సరంలో వీరభద్ర సహిత ఉమామహేశ్వరస్వామి ఆలయంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారే ఇప్పుడు ఇదే సిద్ధేశ్వరస్వామి ఆలయం అంటూ మసిపూసి మారేడుకాయ చేశారని ఆరోపించారు. వెంటనే వారిచ్చిన రిపోర్టును వెంటనే రద్దు చేయాలన్నారు.

సహకారశాఖలో పదోన్నతులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సహకార శాఖలో పలువురికి పదోన్నతులు లభించాయి. రాజంపేట డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసులో పనిచేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎం.గోపీక్రిష్ణకు కడప డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీ సరుగా పదోన్నతి కల్పించారు. అలాగే బద్వేలు సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసరుగా పనిచేస్తున్న వైఎస్ సి.సత్యానందంను ప్రొద్దుటూరు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసరుగా పదోన్నతిపై నియ మించారు. ప్రొద్దుటూరు అసిస్టెంటు రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బ్రహ్మానందరెడ్డికి పదోన్నతి కల్పించి డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆడిట్ ఆఫీసరుగా నియమించారు.

ప్రశాంతంగా డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ ప్రవేశాల కౌన్సెలింగ్

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సా ర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో జరిగిన బీఎఫ్ఏ ఫోర్ ఇయర్స్ డిగ్రీ ఫైన్ ఆర్ట్స్ (యానిమేషన్, అప్లై డ్ ఆర్ట్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, శిల్పం మరియు బి.డెస్ ఇంటీరియర్ డిజైన్) కోర్సులకు కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. 70శాతం విద్యార్థులు హాజరై, డాక్టర్ వైఎస్సార్ ఏఎఫ్‌యూ వీసీ డాక్టర్ జి.విశ్వనాథ్ కుమార్ చేతుల మీదు గా విద్యార్థులు సీట్ అలాట్‌మెంట్ పొందారు. అదేవిధంగా బిఎఫ్ఏ/బి డిజైన్ కోర్సులకు 2వ దశ కౌన్సెలింగ్ సెప్టెంబరు 3న నిర్వహించబడునన్నారు.

కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌పై విచారణ

- పది రోజుల్లో సంజాయిషీ చెప్పాలని నోటీసులు

కలికిరి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కలెక్టరు కార్యాలయంలో కోనేరు రంగారావు కమిటీ (కేసీసీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా విధులు నిర్వహిస్తున్న మణిపాటి రామసుబ్బయ్యపై ప్రభుత్వం విచారణకు ఉపక్రమించింది. ఈ మేరకు పది రోజుల్లో ఆరోపణలపై వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. స్పెషల్ డిప్యూటీ కలెక్టరు రామసుబ్బయ్య నంద్యాల గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులో భూసేకరణ కోసం పనిచేస్తున్న 2020-2022 మధ్య తీవ్రమైన అవకతవకలకు పాల్పడినట్లు ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు ఏసీబీ డైరెక్టర్ జనరల్ ప్రభుత్వానికి అందజేసిన నివేదిక మేరకు తగు చర్యలు తీసుకునే ముందు రామసుబ్బయ్య నుంచి వివరణ కోరింది. 1987లో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరి అనంతరం పదోన్నతులు పొంది అనంతపురం జిల్లా కదిరి ఆర్డీవోగా 2020 వరకూ పనిచేశారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా జీఎన్ఎస్ఎస్ భూసేకరణ విభాగంలో పనిచేసేటప్పుడు వెలుగులోకి వచ్చిన పలు అభియోగాలపై ఏసీబీ దర్యాప్తు జరిపింది. 41 మంది రైతులకు చెందిన డీకేటీ భూములకు పరిహారం చెల్లించకుండా వాయిదాలు వేస్తూ వచ్చారని రైతులు ఆరోపించారు. చివరికి మొత్తం భూములకు చెల్లించాల్సిన రూ.90 లక్షల పరిహారంలో పది శాతం తనకు చెల్లించాలని రామసుబ్బయ్య పట్టుబట్టారని రైతు ల ప్రధాన ఆరోపణ. దీనికిగానూ మొదటి విడతగా రూ.1.50 లక్షలు విడతల వారీగా రైతులు చెల్లించారు. మధ్యలో డబ్బు కోసం వత్తిడి పెరగడంతో వారు నేరుగా ఏసీబీ అధికారులకు, జిల్లా కలెక్టరుకు ఫిర్యాదులు చేశారు. ఫోన్‌పే ద్వారా ఆయన సహాయకుడికి చేసిన డబ్బుల చెల్లింపులు, వాయిస్ కాల్ రికార్డులు ఏసీబీకి లభ్యమయ్యాయి. దీంతో లోతుగా దర్యాప్తు జరిపిన ఏసీబీ సుబ్బరామయ్యపై 2024లో తీవ్రమైన అభియోగాలు నమోదు చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సుదీర్ఘమైన అంశాలను పొందుపరిచిన ఏసీబీ నివేదిక మేరకు విచారణకు సిద్ధమైన ప్రభుత్వం ప్రాథమికంగా సుబ్బరామయ్యకు సోమవారం నోటీసులు జారీ చేసింది. నోటీసులతో పాటు 33 మంది నుంచి తీసుకున్న వాంగ్మూలాలను, రాతమూలకమైన ఫిర్యాదులను కూడా విచారణ కోసం సుబ్బరామయ్యకు జారీ చేసిన నోటీసులకు జత చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

29న సమీచీనం పుస్తక పరిచయ సభ

కడప కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాషా దినోత్సవ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న మధ్యాహ్నం 2.30గంటలకు కడప ఎస్కేఆర్ అండ్ ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెమినార్ హాలులో సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా కవిత్వీకరించిన.. సమీచీనం.. పుస్తకపరిచయ కార్యక్రమం జరగనున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీంద్రనాథ్ హాజరు కానున్నారన్నారు. వీరితో పాటు పలువురు గౌరవ అతిథులు హాజరుకానున్నారన్నారు. నగర ప్రజలు తప్పక హాజరు కావాలని కోరారు.

బాల్యవివాహాలపై అవగాహన

కడప రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ప్రజలలో బాల్యవివాహాలపై అవగాహనను తీసుకొచ్చేందుకు 24 నుంచి 30 వరకు అవగాహన సదస్సులతో పాటు ప్రచార కార్యక్రమాలను చేపడుతున్నామని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం కడప నగరం సరోజినీ నగర్ ఎస్టీ కాలనీలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు.

సంచార జాతులు సదాచార వారసులు

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సంచార జాతులు సదాచార వారసులని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఈనెల 30న విజయవాడలో నిర్వహిస్తున్న సంచార, అర్ధసంచార విముక్త జాతుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కరపత్రాలు విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు లక్ష్మీరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, సునీల్, సుమన్, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

కడప క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి మండపాలకు అనుమతులు తప్పక ఉండాలని కడప టూటౌన్ సీఐ గంట సుబ్బారావు అన్నారు. అశ్లీల నృత్యాలు, మండపాల సమీపంలో చేయరాదని అలా చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం సాయంత్రం వినాయక మండపాలు ఏర్పాటు చేసే సభ్యులతో పోలీసుస్టేషన్‌లో సీఐ సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాత్రి 10 దాటిన తరువాత ఎలాంటి డీజేలు, మైకులు పెట్టరాదన్నారు. కులమతాలకతీతంగా వినాయకచవితి పండుగ జరుపుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం రోజు మద్యం తాగరాదన్నారు. చిన్నపిల్లలను నిమజ్జనం వద్దకు తీసుకురాకూడదన్నారు. పోలీసులకు తప్పనిసరగా రూట్‌మ్యాప్ తెలపాలన్నారు.



కడప..మాట్లాడుతున్న టూటౌన్ సీఐ సుబ్బారావు

చెన్నూరు..: వినాయకచవితి సందర్భంగా మండల వ్యాప్తంగా విగ్రహాలు నిలిపేందుకు ఏర్పాటు చేసుకునే మండపాలకు అనుమతి తప్పనిసరి అని సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక పోలీసుస్టేషనులో ఆయన మాట్లాడుతూ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అలాగే నిమజ్జనం రోజు మద్యం తాగవద్దు. ప్రతి విగ్రహం ఏర్పాటుకు కమిటీ సభ్యులు వచ్చి కచ్చితంగా అనుమతి తీసుకోవాలని సూచించారు నిమజ్జనం రోజు చిన్నపిల్లలను ఎవరినీ తమ వెంట తీసుకెళ్లకూడదన్నారు. అలాగే నిమజ్జనం చేసే చోట పోలీసు సిబ్బంది ఉంటారని, వారి సహకారంతో జాగ్రత్తగా విగ్రహాలను నదిలో నిమజ్జనం చేసుకోవాలనిసూచించారు.

కమలాపురం రూరల్..: వినాయకచవితి పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సీఐ రోషన్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ విద్యాసాగర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఉత్సవ కమిటి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకచవితి మండపాలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. డీజేలు రాత్రి 10దాటిన తరువాత ఎలాంటి డీజేలు పెట్టరాదన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఐ సూర్యనారాయణరెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టరు ఎస్కే రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ అన్ని గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

వల్లూరు..: వినాయకచవితి పండుగను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించుకోవాలని కమలాపురం సీఐ రోషన్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషనులో ఎస్ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో శాంతియుత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతియుత కమిటీ, వినాయక చవితికమిటీ సభ్యులు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసే వినాయక మండపాల దగ్గర నిర్వాహకులు కనీస జాగ్రతలు తప్పని సరిగా పాటించాలని సీఐ చల్లనిదొర తెలిపారు.స్టేషన్ ఆవరణలో మండలంలోని నిర్వాహకులకు సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద రాత్రి వేళల్లో కమిటీ సభ్యుల్లో కొంత మంది అక్కడే పడుకోవాలన్నారు.అశ్లీల నృత్యాలు నిషేధమని,నిమజ్జనం రోజు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని తెలిపారు.

వినాయక పందిర్లకు ఉచిత విద్యుత్ హర్షణీయం

కడప కల్చరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక పందిర్లకు కావలసిన విద్యుత్‌ను కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించడం హర్షణీయమని ఏపీ గణేశ్ ఉత్సవ సమితి జిల్లా ప్రతినిధులు వారణాసి శ్రీధర్‌శర్మ, బ్రాహ్మణపల్లెచంద్రమౌళీశర్మ పేర్కొన్నారు. సోమవారం బ్రాహ్మణవీధిలో గల సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగర ఎస్కేఆర్‌అండ్ఎస్కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం వినాయక చవితి సందర్భంగా ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్‌ల సహకారంతో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష, అనంతపురం ప్రభుత్వ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు జీఎల్ఎన్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. హ్యాండ్స్ ఫర్ యూ వ్యవస్థాపకుడు పి.సుబ్బారావు వంద విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, క్లైమేట్ యాక్షన్ క్యాంపెయిన్ కో-ఆర్డినేటర్ డాక్టర్.పి.శచీదేవి, డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ పి.వి.సుబ్బారెడ్డి, నాగరత్నమ్మ, రమ్యజ్యోతి, మాధురి,పద్మావతిమెడికల్స్‌చైర్మన్ ఎం.లక్ష్మీరెడ్డి, పాలకొండలచైర్మన్ బుర్రి రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల వితరణ

కడప, ఎర్రముక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఎన్జీవో కాలనీ, అప్సర-రాయచోటి రోడ్డు యూనియన్ బ్యాంక్ పైన ఉన్న విశ్వప్రగతి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మంగళవారం ఉదయం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా ఇస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ తుంగా రమణయ్య, డైరెక్టర్ తుంగా వెంకటేష్ తెలిపారు. మట్టి విగ్రహాలను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామని పేర్కొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, రాజశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు,మండల నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

పులివెందుల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని పులివెందుల జడ్పీటీసీ లతారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. పులివెందుల నియోజకవర్గంలోని దాదాపు 212 మందికి రూ.1,00,86,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ పార్టీలకతీతంగా కేవలం అర్హత ఉన్నవారికి మాత్రమే అందిస్తున్నామన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ లతారెడ్డి

సీకేదిన్నె సహకార సంఘం చైర్మన్‌గా శంకర్‌రెడ్డి

సీకేదిన్నె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె ప్రాథమిక వ్యవసాయ పరిపతి సంఘం చైర్మన్‌గా ఇల్లూరు శంకర్‌రెడ్డి సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి హాజరై మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సేవ చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం, కాపాడుకోవడం మనందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. మట్టివిగ్రహాలను పూజించి నిమజ్జనం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాణుల మనుగడ పర్యావరణంపై ఆధారపడి ఉంటుందన్నారు.

'సగం మందికి పథకాలు అందడం లేదు'

కడప కలెక్టరేట్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కూటమి సర్కారులో అనర్హులకు పథకాలు తొలిగించే విషయంలో తీసుకున్న నిర్ణయాల వల్ల చాలా మంది అర్హులకు పథకాలు కట్ చేశారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్ పీర్ విమర్శించారు. సోమవారం ఇంటింటా కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా 27వ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమములో ఆ డివిజన్ ఇన్‌చార్జి షామీర్ హుస్సేన్, కాంగ్రెస్ నేతలు సంజయ కాంత, గంగయ్య, యూసఫ్, ఫజులుల్లా, కరీం పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కడప మారుతీనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర - కర్ణాటక సబ్‌జోన్ అదనపు ఇన్‌చార్జి, సీనియర్ రాజయోగిని గీతాదీదీ ఆధ్వర్యంలో కడప ఓంశాంతినగర్ సేవాకేంద్రం, ఓంశాంతి భవన్‌లో రెండురోజుల పాటు ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం హర్షణీయమని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంటు జిల్లా ప్రోగ్రాం మేనేజరు భాస్కర్ అన్నారు. సోమవారం ఉచిత రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆర్ట్స్‌కాలేజీ కళాశాల లెక్చలర్ నాగరాజు, రమేశ్‌యాదవ్, అక్కయ్యలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఎంఆర్‌సీ ముట్టడిస్తాం

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడప మండల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 30న ఎంఆర్‌సీని ముట్టడిస్తామని ఉపాధ్యాయ సంఘా నాయకులు తెలిపారు. సోమవారం సాయంత్రం ఆర్జేడీ కార్యాలయంలో ఆర్జేడీ శామ్యూల్‌ను కలిసి కడప మండల గత ఎంఈఓ వైఖరిపై ఫిర్యాదు చేశారు. తక్షణం సమస్యలను పరిష్కరించని పక్షంలో ఈనెల 30వ తేదీన కడప ఎంఆర్‌సీని ముట్టడిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాలల చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాలల న్యాయచట్టం, పోక్సోచట్టం, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యార్థులు అవగాహన చేసుకోవాలని వేంపల్లె ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, సుభద్రమ్మ, ఐసీపీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వీరబల్లి కృష్ణప్రతిరూప్ తెలిపారు. మండలంలోని తాళ్లపల్లె, వేంపల్లె జడ్పీ హైస్కూల్లు, రెసిడెన్షియల్ స్కూల్లో చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హెల్ప్‌లైన్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

వేముల..: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రధానోపాధ్యాయుడు జేసుదాసు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నల్లచెరువుపల్లె హైస్కూల్‌లో పిల్లలహక్కులు-చట్టాల గురించి అవాగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నరసింహారెడ్డి, సత్యమారెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి వనరుల నిర్వహణ పుస్తకం ఆవిష్కరణ

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రౌండ్ వాటర్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ స్ట్రాటజీస్ ఏ జియో స్పేషియల్ అప్రోచ్ వాల్యూం-1 అనే పుస్తకాన్ని వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆవిష్కరించారు. పుస్తక రచయిత భూగర్భ శాస్త్రం విభాగపు హెడ్ ప్రొఫెసర్ వంగల సునీత బృందాన్ని అభినందించారు. సోమవారం తన చాంబర్‌లో జరిగిన పుస్తకావిష్కరణ చేశారు.

మూడు నెలల్లో చెన్నంపల్లి ఎంపీపీ పాఠశాల పునర్నిర్మాణం : కలెక్టర్

కడప కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలం చెన్నంపల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను అధునాతన వసతులతో పునర్నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బద్వేలు మండలం, చెన్నంపల్లి ఎంపీపీ ఆదర్శ పాఠశాల పునర్నిర్మాణంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జడ్పీ సీఈవో ఓబులమ్మ,ఎస్ఎస్ఏ ఏపీసీఏ నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏఈఈ గురివిరెడ్డి, ఎంపీడీవో మల్లీశ్వరి పాల్గొన్నారు.

రంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రమదానం

పులివెందుల రూరల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం విద్యార్థులు శ్రమదానం చేపట్టారు. పట్టణంలో శ్రీచైతన్య డిగ్రీ కళాశాల బీకాం విద్యార్థులు కళాశాల కరస్పాండెంట్ నారాయణరెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ కేవీ రమణ శ్రీరంగనాథస్వామి చరిత్ర పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఏపీజేయూ రాష్ట్ర కార్యదర్శి అల్లం రంగనాయకులు, ప్రిన్సిపాల్ వై.ఎన్.రెడ్డి, హిందూ ప్రతినిధి జైకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వేముల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వేముల మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పార్లమెంట్ కార్యదర్శి కస్తూరి రామన్న (యేసు) కోరారు. కడపలో జరిగిన కడప పార్లమెంట్ విస్తృత స్థాయి సమావేశంలో జోనల్ ఇన్‌చార్జి బీద రవిచంద్రను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు రామన్న తెలిపారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

వేముల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసే సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏవో ఓబులేసు తెలిపారు. సోమవారం వి.కొత్తపల్లె, చాగలేరు గ్రామాలలో 80శాతం సబ్సిడీతో డ్రోన్ పరికరాలను అందించారు. మండల టీడీపీ కన్వీనర్ శేషారెడ్డి, యూనియన్ బ్యాంక్‌మేనేజర్ నాగిరెడ్డి, ఏఈఓ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా సత్యశ్రీ చిట్స్ 12వ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి, బాలక్రిష్ణారెడ్డి, లక్ష్మీదేవి

కడప, ఎర్రముక్కపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం ఎర్రముక్కపల్లిలో ఉన్న సత్యశ్రీ చిట్స్ 12వ వార్షికోత్సవం సోమవారం ఉదయం నిర్వహించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్. మాధవి ముఖ్య అతిథులుగా పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సత్యశ్రీ చిట్స్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్లూరి బాలక్రిష్ణారెడ్డి, డైరెక్టర్ ఎ.లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వార్షికోత్సవ కేకను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే ఆర్. మాధవి, మేనేజింగ్ డైరెక్టర్ అండ్లూరు బాలక్రిష్ణారెడ్డి, డైరెక్టర్ ఎ.లక్ష్మీదేవి మాట్లాడుతూ ఖాతాదారులకు నమ్మకమైన సేవలందించి వారి మన్ననలు పొందాలన్నారు.ఈ కార్యక్రమం లో అండ్లూరి బసిరెడ్డి, కార్పొరేటర్లు సుబ్బారెడ్డి,సుదర్శన్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ రాంప్రసాద్‌రెడ్డి, 19వ డివిజన్ ఇన్‌చార్జ్ రంజిత్,మేనేజర్ మహదేవరెడ్డి, బిజినెస్ అడ్వైజర్ మారుతి, కుళ్ళాయిరెడ్డి, భానుప్రకాష్, హరినాథ్‌రెడ్డి, మునెయ్య, మల్లికార్జునరెడ్డి, ఖాతాదారులు పాల్గొన్నారు.

బలిజలకు న్యాయం చేయాలి

త్రిసభ్య కమిటీకి వినతి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బలిజలకు న్యాయం చేయాలని బలిజ సంఘం ప్రతినిధులు కోరారు. సోమారం హరిత హోటల్లో జిల్లా పార్లమెంటరీ సర్వసభ్య సమావేశానికి విచ్చేసిన త్రిసభ్య కమిటీ వారిని బలిజ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజలకు న్యాయం జరగడం లేదని ఎలక్షన్‌లో 99శాతం మంది బలిజలు తెలుగుదేశం పార్టీ విజయానికి కృషిచేయడం జరిగిందన్నారు. కానీ జిల్లాలో ఏ నియోజకవర్గంలో కూడా బలిజలకు న్యాయం జరగలేదని చెప్పారు.నిత్యం బలిజలకు అందుబాటులో ఉండే హరిప్రసాద్‌కు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపిశెట్టి నాగరాజు, జాయింట్ సెక్రటరీ గంధం ప్రసాద్, బాలకృష్ణ, బండి బాబు, పుత్తా రాజు తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం సమర్పిస్తున్న బలిజ సంఘం ప్రతినిధులు

ఘనంగా వికాస్ హరి జన్మదిన వేడుకలు



వికాస్ హరికృష్ణకు కేక్ తినిపిస్తున్న మాజీ కార్పొరేటర్ సరస్వతమ్మ

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అక్కాయపల్లె వికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వికాస్ విద్యాసంస్థల అధినేత వికాస్ హరికృష్ణ పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చైర్మన్ వికాస్ హరికృష్ణని శాలువాతో సత్కరించి కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు చూపిస్తున్న ప్రేమ కల్మషం లేని ప్రేమ అని దానిని పొందడం తన అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ హమీద్, వెంకటేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగించండి

వికాస్ హరికృష్ణ వినతి

కడప ఎర్రముక్కపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శిగా కొనసాగించాలని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ కోరారు. కడప నగరం హరిత హోటల్‌లో టీడీపీ పార్లమెంటరీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న జోన్-4 కో-ఆర్డినేటర్, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్రను కలిసి ఆయన వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవిచంద్రను శాలువతో సత్కరించారు. అలాగే మూడేళ్లుగా జిల్లా ప్రధాన కార్యదర్శిగా పార్టీ కోసం చేసిన సేవలను గుర్తించి మరోసారి జిల్లా ప్రధానకార్యదర్శిగా అవకాశం ఇవ్వాలని కోరారు.



బీద రవిచంద్రను సత్కరిస్తున్న వికాస్ హరికృష్ణ

యూరియాను అధిక ధరకు విక్రయిస్తే కఠిన చర్యలు

వేంపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యూరియాను అధిక ధరకు విక్రయిస్తేకఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరినాథరెడ్డి, సీఐ నరసింహులు, ఏవో శివశంకర్‌రెడ్డి హెచ్చరించారు. వేంపల్లెలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు.గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. యూరియా కొరత నేపథ్యంలో బ్లాక్‌లో విక్రయిస్తే లైసెన్స్ రద్దుచేస్తామని హెచ్చరించారు.



దుకాణాలను తనిఖీ చేస్తున్న దృశ్యం

బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే చర్యలు తప్పవు

పెండ్లిమర్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యూరియాను అక్రమంగా నిలువ ఉంచినా,బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తప్పవని సీఐ చల్లనిదొర తెలిపారు.మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో ఉన్న ఎరువులు,పురుగుల మందుల దుకాణాలను సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం దుకాణాదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించినధరలకే అమ్మాలన్నారు.ప్రతి దుకాణంలో ధరల పట్టిక ఉండాలన్నారు.

నిబంధనలకు లోబడి ఎరువుల అమ్మకాలు జరపాలి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు లోబడి ఎరువుల అమ్మకాలు జరపాలని కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకుడు నరసింహారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని ఎరువుల దుకాణాలను కమలాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రోషన్, ఏవో శ్యామ్‌బాబు, విజిలెన్స్ పీసీ సుధాకర్‌తో కలిసి తనిఖీలు చేపట్టారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బందిపాల్గొన్నారు.

శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప క్రైం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): యువత శక్తియాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి అన్నారు. నగరంలోని ఎస్వీఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో శక్తియాప్ వినియోగం, ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ డాక్టర్ వీర సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు వైనాగేంద్ర, షరీఫ్, శిల్ప, మహిళా ఎస్ఐ శాంతమ్మ, విద్యార్థులు పాలొన్నారు.

చెన్నంపల్లి ఎంపీపీ పాఠశాల పునర్నిర్మాణం

కడప కలెక్టరేట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బద్వేలు మండలం చెన్నం పల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఆధునాతన వసతులతో పునర్నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బద్వేలు మండలం, చెన్నంపల్లి ఎంపీపీ ఆదర్శ పాఠశాల పునర్నిర్మాణంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చెన్నం పల్లి ఎంపీపీ పాఠశాల గదులు కోల్పోవడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి పరిహారంగా నేషనల్ హైవే వారు అందించిన మొత్తంతో పాటు పాఠశాలకు సంబంధించి 50సెంట్లు తరగతి గదుల భవనంతో టాయిలెట్స్, ఆధునాతనంగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఓబులమ్మ, ఎస్ఎస్ఏ ఏపీసీఏ నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏఈఈ గురివిరెడ్డి, ఎంపీడీవో మల్లేశ్వరీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నమ్మకద్రోహం చేశాడని ఫిర్యాదు

పోరుమామిళ్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పొలం అమ్మే విషయంలో ముందు కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి పిడతల శ్రీనివాస్‌గౌడ్ అనే వ్యక్తి తనకు డబ్బులు ఇవ్వకుండా నమ్మక ద్రోహం చేశాడని తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన శ్రీనగర్ కాలనీవాసి చెరుకుపల్లె వెంకట కృష్ణారెడ్డి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. వెంకటకృష్ణారెడ్డి చెందిన పోరుమామిళ్ల మండలంలో అక్కలొరెడ్డిపల్లె 21.24ఎకరాల వ్యవసాయ భూమిపై విడుదల శ్రీనివాస్‌గౌడ్‌కు 2016లో జీపీఏ ఇవ్వగా సదరు వ్యక్తి భూ విక్రయం జరపాలన్న ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా సదరు భూమిని 13 ఎకరాలు విక్ర యించి వచ్చిన డబ్బులు ఇవ్వకుండా నమ్మకద్రోహం చేశారని ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

1098పై అవగాహన

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు బాలికల ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 1098 గురించి సోమవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలకార్మికులు, అనాథ పిల్లల గురించి 1098కు వివరాలు తెలుపాలన్నారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో విజిలెన్స్ దాడులు

● కొరత సృష్టించినా, అక్రమ నిల్వలు ఉంచినా వేటు తప్పదంటున్న అధికారులు ● రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలిగించవద్దంటూ ఆదేశాలు



చాపాడులో యూరియా బస్తాలను పరిశీలిస్తున్న ఏవో దేవీ పద్మలత

దువ్వూరులో ఎరువుల అంగళ్లను తనిఖీ చేస్తున్న అధికారులు

దువ్వూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తప్పవంటూ రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించడంతో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా మండలంలోని దువ్వూరు, చింతకుంట, కానగూడూరు గ్రామాల్లో సోమవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ జి.శ్రీనివాసరావు, సీఐ ఎం.శివన్నతోపాటు మైదుకూరు ఏడీఏ క్రిష్ణమూర్తి, ఏవో అమర్‌నాథ్‌రెడ్డి ఎరువుల దుకాణాలను ఆకస్మిక తనిఖీలు చేశారు. మొదట దువ్వూరులోని రసాయనిక ఎరువులు విక్రయించే అంగళ్లలోకి వెళ్లి నిలువలను పరిశీలించారు. అనంతరం కానగూడూరులో సోదాలు చేసి క్రయ విక్రయాల గురించి అంగళ్ల యజమానులతో మాట్లాడారు. తదనంతరం చింతకుంటలో కేఎన్‌ఆర్ ఎరువుల అంగడిలో తనిఖీ చేయగా బస్తాల్లో తేడాలను గమనించి అమ్మకాలను తాత్కాలికంగా నిలుపుదల చేయించినట్లు ఏడీఏ క్రిష్ణమూర్తి తెలిపారు. అనంతరం విజిలెన్స్ సీఐ శివన్న మాట్లాడుతూ జిల్లాలో 3,200 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. యూరియా బస్తారేటు రూ.266.50 పైసలకే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రసాయనిక ఎరువుల విషయంలో రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని తెలిపారు.

ముద్దనూరులో: మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం వ్యవసాయశాఖ, పోలీసు శాఖ సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, సీఐ దస్తగిరి ఎరువుల దుకాణలలోని ఎరువులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు, రైతులు కొన్న ప్రతి ఎరువుకు బిల్లులు ఇవ్వాలన్నారు. దుకాణాల్లోని గోడౌన్‌లో ఎరువులను పరిశీలించారు. ఏవో వెంకటకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చాపాడులో: ప్రైవేటు దుకాణ యజమానులు యూరియాను రైతులకు ఎక్కువ రేటుకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి దేవీపద్మలత హెచ్చరించారు. చాపాడులోని రసాయనిక ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఆమె తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఇప్పటి వరకు రైతులకు 707 టన్నుల యూరియాను విక్రయించామని ఇంకా 34 టన్నుల యూరియా సిద్ధంగా ఉందన్నారు. ఒక బస్తా యూరియా రూ.266.50 కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. డీఏపీ కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ప్రస్తుతం రసాయనిక ఎరువులను సిద్ధంగా ఉంచామన్నారు.

ఖాజీపేటలో: మండల పరిధిలో యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పని విజిలెన్స్ అధికారి ఆర్‌వీఈవో శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఖాజీపేట ఫెర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు రైతులకు ఎరువులు అందించాలని, ఎక్కువ ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. నానో యూరియా కూడా రైతులకు అంబాటులో ఉందని, పురుగు మందులతోపాటు నానో యూరియాను స్ప్రే చేసుకోవచ్చన్నారు. ఈ తనిఖీల్లో సీఐ మోహన్, మండల వ్యవసాయ శాఖ అధికారి నాగఅర్చన, విజిలెన్స్ డీసీపీవో గీతావాణి, కడప సీఐ రామక్రిష్ణ, పాల్గొన్నారు.

బద్వేలులో: బద్వేలు, గోపవరం మండలాల ఎరువుల దుకాణాలను సోమవారం విజిలెన్స్ అధికారులు, సీఐ లింగప్ప ఆకస్మిక తనిఖీలు చేశారు. ఎవరైనా నిర్ణయించిన ధరకు మించి ఎక్కువ అమ్మినా దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు. ఎప్పటి కప్పుడు దుకాణాలను తనిఖీ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకుడు వెంకటసుబ్బయ్య, వ్యవసాయాధికారి విజయరావు, బద్వేలు మండల వ్యవసాయాధికారి అరుణ, వ్యవసాయ విస్తరణాదికారి ఓబయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్యసభ అధ్యక్షుడిగా చెన్నకేశవ ప్రసాద్



మైదుకూరు రూరల్, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి) : ఆర్యవైశ్య సభ నూతన అధ్యక్షుడిగా బల్లాని చెన్నకేశవప్రసాద్ ఎన్నికైయ్యారు. స్థానిక వాసవీమాత ఆలయంలో సోమవారం ఆర్యవైశ్యసభ నూతన కార్యవర్గం సమావేశంలో మైదుకూరు ఆర్యవైశ్య సభ అధ్యక్షుడిగా బల్లాని చెన్నకేశవప్రసాద్‌ను, ఉపాధ్యక్షులుగా జూటూరు బాలవీరయ్య, పేరూరు నాగరాజు, పబ్బతి గోపాల్, దొంతు వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శిగా కోట అశోక్‌కుమార్, ఉప కార్యదర్శులుగా పుట్టా శివయ్య, దేవత శ్రీరాములు,సూరే సుబ్బరాజు, దరిశా శ్రీనివాసులు, సందిపైటి సతీష్, వంకదార రవి, కోశాధికారిగా దరిశా శ్రీనివాసులు, ఉప కోశాధికారులుగా కటకం వెంకటసుబ్బయ్య, ఎల్లనూరు జగన్, రామక్రిష్ణ, దరిశా ప్రసాద్, ప్రత్యేక పర్యవేక్షకులుగా సత్యనారాయణ, సుబ్బరాయుడు, సురేష్‌బాబు, సుధాకర్, శివశం కర్, కార్యవర్గ సభ్యులుగా అయ్యవారప్ప, సంజీవ్‌రాయ గుప్తా, పెద్దపుల్లయ్య, రమణయ్య, హరనాధ్, సుభాకర్, శివచక్రవర్తి, సతీష్, శ్రీనివాసులునుఎన్నుకున్నారు.

డిజిటల్ లావాదేవీలు ప్రయోజనకరం

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీలు ఎంతో ఉపయోగకరమని స్టేట్‌బ్యాంకు మేనేజరు కె.రాజవంశవర్ధన్ పిలుపునిచ్చారు. సోమవారం సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం -3 లో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌ఎమెంటు సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు వారి సౌజన్యంతో డిజిటల్ లావాదేవీలు, సైబర్ క్రైంపై డ్వాక్రాసంఘం మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగ బ్యాంకు మేనేజరు మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ లావాదేవీలు ఎంతో అవసరమన్నారు. అలాగే ఏపీజీబీ రిటైర్డ్ బ్యాంకు మేనేజరు క్రిష్ణరెడ్డి మాట్లాడారు.

ప్రశాంతంగా వేడుకలు జరుపుకోండి

జమ్మలమడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను ఉత్సవ కమిటీలవారు, ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని తహసీల్దారు శ్రీనివాసరెడ్డి సూచించారు. సోమవారం అర్బన్ సీఐ నరేష్ బాబు, ఎస్ఐ హైమావతి ప్రజా సమస్యల పరిష్కార వేదికతోపాటు వినాయక చవితి పండుగ వేడుకలపై చర్చించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డితో నూతన ధర్మకర్తల మండలి సభ్యులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బొల్లవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి నూతన పాలక మండలి కృషి చేయాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సూచించారు. ఆలయ నూతన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం సోమవారం ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్‌గా దాదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సభ్యులుగా పి.రాధా, జి.రాజేశ్వరి, సి.సావిత్రి, ఆర్.ప్రసాద్, జి.శివనాగిరెడ్డి, వై.శ్రీనివాసులరెడ్డి, ధనుంజయ శర్మ, ఎక్స్‌అఫిషియో మెంబర్ లక్ష్మీనారాయణశర్మలు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఎం సురేష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, పట్టణాధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్.ముక్తియార్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్ అహ్మద్, రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, బీసీ నాయకుడు చల్లా రాజగోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అనధికారిక లేఅవుట్లు, ప్లాట్ల స్థలాల క్రమబద్దీకరణకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కడప పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) ప్రణాళికా ఏపీవో ఆసిఫ్ సూచించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులకు సమావేశంలో అనధికారిక లేఅవుట్లు, ప్లాట్ల స్థలాలకు సంబందించి అవగాహన కల్పించారు. 90 రోజుల్లో లైసెన్సు కలిగిన ప్లానర్స్ లేదా వ్యక్తిగతంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదుకు గడువు ఉందన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో శివారెడ్డి, కడప జేపీవో శారదాంబ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తరలివస్తున్న గణనాథులు

కొండాపురం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి వేడుకలకు గణనాథులను మండపాలకు తరలిస్తున్నారు. ఈ సందర్భంగా మండపాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. కొండాపురం పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో సుమారు 23 అడుగుల భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేయనున్నారు. బాణసంచా పేల్చకుంటూ విగ్రహాలను తరలిస్తున్నారు.

దువ్వూరులో: కొలువు తీరవయ్యా... కొలిచెదమంటూ వినాయక విగ్రహాలను గ్రామాలకు తరలిస్తున్నారు. గణనాథుని ప్రతిమలను ప్రొద్దుటూరు నుంచి దువ్వూరులోని పలు గ్రామాలకు యువకులు తీసుకెళుతున్నారు. చవితి సందడి ముందుగానే వచ్చింది. ఇప్పటికే పోలీసుల అనుమతి పొందారు.

పోరుమామిళ్లలో: వినాయకచవితి పండుగ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు భారీ విగ్రహాలు ఎంపిక చేసుకుని తమ గ్రామాలకు తరలిస్తున్నారు. సోమవారం ట్రాక్టర్లలో గణనాధుని విగ్రహాలు తరలింపు కార్యక్రమాలు చేపట్టారు.

పోట్లదుర్తిలో రూ.40లక్షలతో పశువైద్యశాల

ఎర్రగుంట్ల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లదుర్తిలో రూ.40 లక్షలతో పశువైద్యశాల నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. సుమారు 55ఏళ్ల క్రితం ఇక్కడ పశువుల ఆసుపత్రి నిర్మించగా అది శిథిలావస్థకు చేరుకోవడంతో వైద్యసేవలకు ఇబ్బందికరంగా మారింది. దీంతో పాత భవనాన్ని కూల్చి కొత్త భవనాన్ని నిర్మించేందుకు నిధులు మంజూరు అయ్యాయి. దసరా లేదా దీపావళికి ఈ భవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. అప్పటి వరకు పాత రైతు సేవా కేంద్రంలో ఆసుపత్రిని నడుపుతున్నారు.

ప్రభుత్వ ధరలకే ఎరువులు విక్రయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వరరావు

ముద్దనూరు ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే ఎరువులను డీలర్లు విక్రయించాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు సూచించారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో సోమవారం ముద్దనూరు వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ముద్దనూరు, కొండాపురం, సింహాద్రిపురం, తొండూరు ఎరువుల దుకాణాల డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు ఎరువుల నియంత్రణ చట్టం ప్రకారం వ్యాపార లావాదేవీలు చేసుకోవాలన్నారు. రైతులకు యూరియా కొరత లేకుండా పంపిణీ చేయాలన్నారు.చట్టాన్ని అతిక్రమిస్తే తగుచర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, సీఐ దస్తగిరి,ఏవోలు వెంకటకృష్ణారెడ్డి,కళ్యాణ్‌కుమార్,రాజు,టెక్నికల్ ఏవో మధుసూధనరెడ్డి,సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరికలు



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రితేష్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి

అట్లూరు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలం కుంభగిరి పంచాయతీ ఎంపీటీసీ మద్దెల చిన్నగంగయ్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పాలకొండు రాధాక్రిష్ణారెడ్డితో పాటువంద కుటుంబాలు వైసీపీ నుంచి సోమవారం టీడీపీలో చేరారు. డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరి సూర్యనారాయణరెడ్డి, బద్వేలు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాపుదిప్పు మల్లిఖార్జునరెడ్డి సమక్షంలో పాలకొండు రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో రామక్రిష్ణారెడ్డి, తిరుపాల్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, శంకర, చిన్నరాముడు, సుబ్బరాయుడు, నరసయ్య, రాజు, జయన్న, చంచయ్య తదితర కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా రితీష్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్.శంకరాపురంలో 14 దళిత కుటుంబాలకు కూటమిప ్రభుత్వం తరఫున అందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే సాగునీరు, రోడ్లు, మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు అరవ శ్రీనివాసులరెడ్డి, మండల ఇన్‌చార్జి రెడ్డయ్య సింగిల్‌విండో డైరెక్టరు రాధాక్రిలష్ణారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, పరశురాం, చినేగంగయ్య, కోటపాటి పెంచలయ్య, నరసింహులు, క్రిష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి



మాట్లాడుతున్న కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు , ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ జయంతి అక్టోబరు 2నాటికి ప్రొద్దుటూరులో మహాత్ముని స్ఫూర్తితో ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభాభవనంలో ప్లాస్టిక్ నిర్మూలన ఇంటింటా చెత్త నిర్మూన కార్యక్రమంపై మెప్మా ఆర్‌పీ, సీవోలు పట్టణంలోని హోటళ్లు కళ్యాణ మండపాలు ఇతర వ్యాపార వేత్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించాలన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా గతకాలపు స్టీలు, గాజు, పింగాణి సిల్వర్ వస్తువులను వాడాలన్నారు. తడిచెత్తతో హోంకంపోస్టు ద్వారా ఎరువుగా మార్చవచ్చన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ శ్రీనివాసులు, మెప్మా సీఎంఎం మహాలక్ష్మీ, క్లీన్‌ఆంధ్ర ఏజన్సీ నుంచి మనీషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీత పాల్గొన్నారు.

అపోహలు వీడి రక్తదానం చేయండి

జమ్మలమడుగు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు అపోహలు వీడి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జమ్మలమడుగు ఓంశాంతి బ్రహ్మకుమారీ సేవా కేంద్రం నిర్వాహకురాలు బీకే ఉమసిస్టర్ సూచించారు. సోమవారం పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆవరణలో విశ్వబంధుత్వ దినం రాజయోగిని దాది ప్రకాశమణి 18వ పుణ్యస్మృతి (వర్ధంతి) పురష్కరించుకుని మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ఆపదలో రక్తంలేని వారికి ప్రాణాన్ని ఇవ్వడమేనన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 15 మంది విద్యార్థులతోపాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ కాశిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, మెడికల్ అధికారులు రఫిక్‌పాషా, దిలీప్, ఎస్ఐ హైమావతి, బ్రహ్మకుమారి సేవా కేంద్రం కమిటీ సభ్యులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగిన మంటలు

బద్వేలుటౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సిద్దవటం రోడ్డులో గల నూతన ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం రాత్రి ఒక్కసారిగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రధాన రహదారి పక్కనే ఉండటంతో అటువైపు వెళుతున్న వాహనదారులు హడలిపోయారు. స్థానికులు విద్యుత్ అధికారులకో సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొనిమంటలను అదుపుచేసి, ఎటువంటి ప్రమాదం వాటిళ్లకుండా చర్యలు తీసుకోవడంతో స్థానికులు ఊపరిపీల్చుకున్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలి

కాశినాయన ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థవంతమైన బోధన చేయాలని ఎంఈవో ఓ.నిర్మల పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఆకుల నారాయణపల్లె, నాయనపల్లె, బాలాయపల్లె గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆమె తనిఖీచేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయ, విద్యార్థుల హాజరు, పాఠశాల రిజిస్టర్లు, ఎఫ్ఏ 1 అసేస్‌మెంట్ రిజిస్టర్‌లను పరిశీలించారు..అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు

హెచ్ఎంల సంఘం అధ్యక్షుడిగా వెంకటసుబ్బారెడ్డి

బద్వేలు, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బద్వేలు బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బారెడ్డి ఎన్నికయ్యారు. గతంలో ఆయన మూడుసార్లు ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయ, నాన్ టీచింగ్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. పాఠశాల సెక్రటరీ భారతి, జూనియర్ కళాశాల ఇన్‌చార్జి జకరయ్య పాల్గొన్నారు.